ప్రజాశక్తి

మంగళవారం 23 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

అదే స్పీచ్...

- 1995లో బిల్‌గేట్స్‌నే ఆశ్చర్యపరిచాను..
- మోడీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి
- జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రపంచానికే మన దేశం టెక్నాలజీ ఇవ్వబోతుంది. 1990వ దశకంలో తాను చేసిన ప్రయత్నంతో దేశంలోనే ఐటికి ఆద్యుడిగా పేరొచ్చింది. 2047 నాటికి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా వెళ్లబోతుంది. ఆ విప్లవానికి ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం పార్టీ లీడ్ చేయబోతుంది.' అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైన 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో ఆయన ప్రసంగించారు. దీంతో సదస్సుకు హాజరైన పలువురు చంద్రబాబు ఉపన్యాసాల్లో ఏ మాత్రం కొత్తదనం కనిపించలేదంటూ గుసగుసలాడడం కనిపించింది. ఈ కాలంలో నాలుగైదు సార్లు విశాఖలో పలు ఈవెంట్లలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి ఒకటే మూస ప్రసంగాలు చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. ప్రత్యేకంగా దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తారు. సరైన వ్యక్తి, సరైన సమయంలో ఈ దేశానికి ప్రధానిగా ఉన్నారంటూ గత సభల్లో చెప్పిన మాటలనే పదేపదే చెప్పారు. టెక్నాలజీ, అభివృద్ధి విధానాలతో అందరినీ ఆకట్టుకున్నానిని చెబుతోన్న చంద్రబాబు విశాఖలో ఇన్ని పర్యాయాలు సమావేశాలు నిర్వహించినప్పటికీ విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, పథకాలు, పరిశ్రమలపై ఏనాడూ సమగ్రమైన అభివృద్ధి కోసం ప్రసంగించకపోవడం కనిపిస్తోంది. గతంలో ఇంటికొక ఐటి వేత్తను ఇచ్చానని తాజాగా ప్రతి ఇంటినుంచీ పారిశ్రామికవేత్తను తయారు చేస్తానంటూ పలుమార్లు ప్రస్తావించారు. ఐటి, ఎఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబో టెక్నాలజీ, క్వాంటమ్ వేలీ వంటి అంశాలను పదేపదే వల్లెవేశారు. అన్ని దేశాల్లోనూ ప్రజలు ముసలైపోయారని 143 కోట్ల భారత్ జనాభాలో యువత అత్యధికంగా ఉందని జపాన్, చైనా, అమెరికా కూడా పోటీపడలేని స్థాయికి ఈ దేశం వెళ్లబోతుందంటూ జోస్యం చెప్పారు.

బిల్ గేట్స్‌ను ఆకట్టుకున్నాను....

తాను ఎవరినైనా పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో ఆకట్టుకోగలనని చెబుతూ ఇలా అన్నారు. '1995లో నేను ముఖ్యమంత్రిని అయ్యాక బిల్‌గేట్స్ ఢిల్లీ వస్తున్నారని తెలిసి ఆయన్ను కలవాలనుకున్నా ఆయనతో పది నిమిషాలు కావాలని అడిగాను. రాజకీయ నాయకులతో నేను మాట్లాడనని బిల్‌గేట్స్ అన్నారు. అయినా టైం ఇవ్వాలని కోరాను. ఢిల్లీలోని అమెరికా ఎంబసిలో నేనిచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడంతో ఆయన ఆశ్చర్యపోయారు. 10 నిమిషాలు కాదు ఏకంగా 45 నిమిషాలు టైం ఇచ్చారు. మేం అన్ని రంగాల్లో మేధావులం, మాకు మీ సపోర్టు కావాలన్నాను. ఆ తర్వాత ఇండియాలో ఐటి విప్లవానికి నేను ప్రధాన పాత్రపోషించాను. హైదరాబాద్‌లో తొలిసారి మైక్రోసాఫ్ట్ అభివృద్ధి కేంద్రం ఏర్పాటు ఒక చరిత్ర. అప్పట్లో బిఎస్ఎన్ఎల్, ఇంటర్నేషనల్ కాల్స్ రెండే ఉండేవి. నా కొడుకు అమెరికాలో చదువుకునే రోజుల్లో ఫోన్‌లో మాట్లాడితే వేలల్లో బిల్లు

మిగతా 2లో..

చలో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఇన్‌సెట్‌లో ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు

ఎయు విద్యార్థుల చలో కలెక్టరేట్ ఉద్రిక్తం

- 26 మంది ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యాన సోమవారం చేపట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తంగా మారింది. ఎయు ప్రధాన ద్వారం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 9 ప్రధాన డిమాండ్లపై పెద్దపెట్టున నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు పెరిగిన మెస్ బిల్లులకు అనుగుణంగా ప్రతి విద్యార్థికీ రూ.3500 స్కాలర్‌షిప్ పెంచాలని డిమాండ్‌చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి 26 మంది ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

ప్రధాన వార్త మెయిన్‌లో...

పిడుగు పడి కార్మికుడు మృతి

వార్త మెయిన్‌లో..

మిడ్డే, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వార్త 2లో..

పెదగంట్యాడ ఉక్కు హెల్త్ సెంటర్‌లో వైద్యసేవల కుదింపుపై నిరసన

వార్త 4లో..



అంతా ఊహించినట్టే..

- విశాఖ డెయిరీ అవకతవకలపై విచారణ మళ్లీ 6 నెలలు వాయిదా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ డెయిరీ యాజమాన్యం ఏళ్లతరబడి రైతులను మోసగిస్తూ అక్రమాలకు పాల్పడిన వైనం, రూ.వందల కోట్ల అవినీతి చర్యలకు పాల్పడిన వ్యవహారంపై హౌస్ కమిటీ విచారణను రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ వాయిదా వేసింది. ఈ మేరకు మరో 6 నెలలకు పొడిగిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం గడువు ఇచ్చారు. శాసనసభా సంఘం చైర్మన్ అభ్యర్థన మేరకు ఇలా గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే విచారణ త్వరగా పూర్తిచేయాలని స్పీకర్ అయ్యన్న సన్నాయి నొక్కులు నొక్కారు. ఇది మూడోసారి ఇలా గడువును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేయడంతో విశాఖ డెయిరీ రైతుల్లో తీవ్ర ఆవేదన నెలకొంటుంది. 2024 ఎన్నికల తర్వాత వైసిపి నుంచి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బిజెపి తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బిజెపిలో ఇలాంటి దోషులను కాపాడేందుకు ప్రత్యేక యంత్రాంగం ఇదివరకే ఉండడంతో ఆచితూచి ఆడారి అటువైపు అడుగు వేశారు. దీంతో ఎన్నికలకు ముందు డెయిరీ యజమానిపై విమర్శలు గుప్పించిన టిడిపి, జనసేన, బిజెపి నేతలు అంతా గప్‌చుప్ అయిపోయారు.

2024 ఎన్నికల తర్వాత తూతూ మంత్రంగా జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన ఒక హౌస్‌కమిటీ విచారణకు ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీని పనిచెయ్యనివ్వకుండా బిజెపి అడ్డుకుంటుందా? లేక టిడిపి, జనసేన నేతలు కూడా విశాఖ డెయిరీ చైర్మన్‌తో కుమ్మక్కయి విచారణ వాయిదాకు సహకరిస్తున్నారా? అన్న అనుమానాలు ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల రైతుల్లో తీవ్రస్థాయిలో చర్చనీయాంశమైంది.

తొలగింపులపై ఆగ్రహం

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా

తోపుడు బండ్లను యథావిధిగా కొనసాగించాలి : సిఐటియు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖలో తోపుడు బండ్లు, బడ్డీల తొలగింపుపై చిరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఐటియు నాయకత్వంలో వందలాది మంది బాధితులు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా 8 జోన్ల పరిధిలో సుమారు 2,500 తోపుడుబండ్లు, బడ్డీలు తొలగించడం అన్యాయమని, వాటిని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్‌చేశారు. గత 30 సంవత్సరాల నుంచి ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా తోపుడు బండ్లు, వీధి విక్రయదారులుగా వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఏ రకమైన నోటీసులు లేకుండా తోపుడుబండ్లను, బడ్డీలను తొలగించి ఈ కుటుంబాలను రోడ్డు మీదకు

మిగతా 2లో..

మహాధర్నాలో పాల్గొన్న చిరు వ్యాపారులు, సిఐటియు, ఎఐటియుసి నాయకులు

మొదటి పేజీ తరువాయి..

అదే స్పీచ్..

చెల్లించేవాడిని.' అని వేదికపై చంద్రబాబు చెప్పగానే పారిశ్రామిక వేత్తలు, కంపెనీల ప్రతినిధులు ఒక్కసారిగా గొల్లుమని నవ్వారు. చంద్రబాబు కాసేపు ఆశ్చర్యపడి తర్వాత ఆయన కూడా నవ్వేశారు. అంతటితో ఆగకుండా అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సెల్‌ఫోన్ల ఆవశ్యకతపై రిపోర్టు ఇచ్చాను. ఆ తర్వాత 2జి నుంచి ఇప్పటి 6జికి వచ్చాం. తర్వాత 7జికి వెళ్లబోతున్నాం. అప్పట్లో కర్నాటక సిఎం ఎస్‌ఎం.కృష్ణే నాకు పోటీకానీ ఇప్పుడు అన్ని రాష్ట్రాలు పోటీనిస్తున్నాయి. ఇది మంచి పరిణామం అంటూ చంద్రబాబు చెపుకొచ్చారు.

నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థకు టిడిపియే నాయకత్వం...

భవిష్యత్తులో ఇండియా ప్రపంచానికే టెక్నాలజీ ఇవ్వబోతుందని, నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా భారత్ 2047 నాటికి అవతరించబోతుందని, ఆ విప్లవానికి ఏపి నుంచి తెలుగుదేశం పార్టీ నాయకత్వం వహించనుందని చంద్రబాబు సభలో ప్రస్తావించారు. అందరినీ తన నైపుణ్యం ద్వారా ఆకట్టుకుంటున్నాని చెబుతోన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో తన చాకచక్యం ఏమైందన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తింది. నాలుగున్నరేళ్లుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికుల విషయంలో కేంద్రంలోని మోడీ సర్కారు కనికరం చూపడం లేదు. యాజమాన్యం ఇప్పటికే 5వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించేసింది. ప్రైవేటీకరణ ఆపేందుకు చంద్రబాబు మోడీని ఎందుకు ఇంప్రెస్ చేయలేకపోతున్నారు? అన్న ప్రశ్న అందరి ముఖాల్లోనూ కనిపించింది.

తొలగింపులపై ఆగ్రహం

తోయడం తగదన్నారు. తోపుడు బండ్లు, వీధివిక్రయదారులపై దాడులు ఆపాలని, పగలగొట్టిన తోపుడుబండ్లకు నష్టపరిహారం ఇవ్వాలని, తొలగించిన తోపుడుబండ్లను అదే స్థానంలో కొనసాగించాలని జివిఎంసి కమిషనర్‌ను డిమాండ్ చేశారు.

విశాఖపట్నం తోపుడు బండ్ల, చిల్లర వర్తక కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, 2014 వీధి విక్రయదారుల చట్టం ప్రకారం రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే చిల్లర వర్తకులకు ఎక్కడివారికక్కడే ఉపాధి రక్షణ కల్పించి, కొనసాగించాలని కోరారు. మున్సిపల్ చట్టం, వీధి విక్రయదారుల చట్టాలు వేర్వేరు అని, ప్రస్తుత కొత్త కమిషనర్ మున్సిపల్ చట్టాన్ని అమలు చేస్తూ వీధివిక్రయదారుల చట్టాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. వీధివిక్రయదారుల చట్టాన్ని అమలు చేయకుండా, గాజువాకలో 32 తోపుడుబండ్లను పాత కమిషనర్ హరి నారాయణ గతంలో తొలగించారని, అప్పట్లో సిఐటియు హైకోర్టుకు వెళ్లి అదే స్థానంలో కార్మికులను వ్యాపారం చేసుకోవడానికి పర్మిషన్ తీసుకొచ్చినట్లు తెలిపారు. వీధివిక్రయదారుల చట్టాన్ని అమలు చేయనందున కమిషనర్‌కు రూ.2 వేలు జరిమానా, జైలు శిక్ష కూడా విధించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత కమిషనర్ కూడా వీధివిక్రయిదారుల చట్టాన్ని అమలు చేయకుండా పొట్ట కొడుతున్నారన్నారు. విశాఖపట్నం తోపుడుబండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ, ఎక్కడైనా తోపుడుబండ్లను తొలగించాలంటే వెండింగ్ కమిటీలో నిర్ణయం చేయాలి కానీ జివిఎంసి కమిషనర్ కౌన్సిల్ తీర్మానానికి అనుగుణంగా తొలగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. తక్షణం స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని అమలు చేయాలని కమిషనర్‌ను డిమాండ్ చేశారు. తోపుడుబండ్లు కార్మికులపై దాడులు ఆపకపోతే జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మహా ధర్నా అనంతరం జివిఎంసి ప్రధాన కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ఆందోళనకారులు సిద్ధపడగా, పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీసులతో ఆందోళనకారులు కొంతసేపు వాదనకు దిగారు. పదిమంది జివిఎంసి అధికారుల వద్దకు రావాలని పోలీసులు కోరారు. అలా కుదరదని అధికారులే ఇక్కడికి వచ్చి సమాధానం చెప్పాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని జివిఎంసి అడిషనల్ కమిషనర్లు రమణమూర్తి, ఎస్‌ఎస్.వర్మ, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్ అక్కడికి వచ్చారు. వీరికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కుమార్ అందజేశారు.

ఈ ధర్నాలో తోపుడుబండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు మూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శులు పి.వెంకటరావు, ఒ.అప్పారావు, ఉపాధ్యక్షులు ఎం.సుబ్బారావు, అనసూయ తోపుడు బండ్లు సంఘం నాయకులు మురళి, సిఐటియు మధురవాడ నాయకులు పి.రాజ్‌కుమార్, 1500 మంది తోపుడుబండ్లు కార్మికులు పాల్గొన్నారు.

మిడ్డే, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ వర్కర్లపై రాజకీయ వేధింపులను తక్షణ ఆపాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గునూరు వరలక్ష్మి మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో కార్మికులపై టిడిపి నాయకులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ల వేధింపులు తీవ్రమయ్యాయని, అకారణంగా కార్మికులను తొలగిస్తున్నారని తెలిపారు. పద్మనాభం మండలం మద్ది గ్రామంలో పని చేస్తున్న మిడ్ డే మీల్ వర్కర్లను తొలగించి స్కూల్ కమిటీ చైర్మన్ వడ్డిస్తానని వేధిస్తున్నారని, పాండ్రంగిలో 60 సంవత్సరాలు వయసు దాటిందని ఒక మహిళను వంట మానేయమని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భీమిలి మండలం మజ్జివలసలో పాతవారిని విధుల్లోకి తీసుకోబోమని, దిక్కున చోటుకి చెప్పుకోమని స్కూల్ కమిటీ చైర్మన్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వడ్లపూడి, నరవలో శానిటేషన్ వర్కర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా ప్రతి స్కూల్లోనూ టిడిపి, జనసేన నాయకులు, స్కూల్ కమిటీ చైర్మన్లు వేధింపులకు పాల్పడుతున్నారని, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని, తక్షణం వీటిని ఆపాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు హామీ ఇచ్చిన విధంగా తక్షణం గ్యాస్ సరఫరా చేయాలని, రెండు నెలల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని, మెనూ ఛార్జీలను విద్యార్థికి రూ.20 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భవాని, జి.మంగశ్రీ, సిఐటియు నాయకులు పి.మణి, యూనియన్ ముఖ్య నాయకులు రాము, గౌరీ, నర్సియమ్మ, ధనలక్ష్మి, సావిత్రి పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సహకార బ్యాంకులపై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే కార్యక్రమాలను పురస్కరించుకుని ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు, జిల్లా సహకార శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాంనగర్‌లోని పైడా డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంకులో పొదుపు ఖాతాలు, వాటి నిర్వహణ, విద్యా రుణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రత్యేక రుణసదుపాయాన్ని తమ బ్యాంకు కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పైడావిద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, సహకారశాఖ జిల్లా అధికారి సత్యశ్రీ, ప్రిన్సిపల్ డాక్టర్ సరోజిని, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్యామ్ కిషోర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావు నియమితులయ్యారు. బాలల రక్షణ సంరక్షణకు సంబంధించిన జువైనలై జస్టిస్ చట్టం ప్రకారం విశాఖ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన బాలగృహాల పనితీరుపై తనిఖీ కమిటీ ఏర్పాటుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, మూడేళ్ల కాల పరిమితి గల ఈ కమిటీ విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ బాలగృహాలు చట్టం ప్రకారం నిబంధనలు పాటిస్తున్నారా లేదా తనిఖీచేసి, నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తాయన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జ్ఞానాపురంలో జూబ్లీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సన్ డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గణేష్ మహారాణా, పిల్ల హేమంత్ కుమార్ పర్యవేక్షణలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. జూబ్లీ స్కూలు, వివేకానంద విద్యా నిలయం, అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్, సిపి బ్రౌన్ హైస్కూల్, న్యూటన్ హైస్కూల్ ఇతర కరాటే విద్యార్థులు కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో విశాఖ కరాటే పితామహులు మల్ల సూర్యారావు తనయుడు మల్ల సుధాకర్ గ్రాండ్ మాస్టర్‌గా ఈ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ గ్రేడింగ్‌లో మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంచరపాలేనికి చెందిన వివేకానంద విద్యాలయం విద్యార్థి నిత్యతేజకు బ్లాక్‌బెల్ట్ ప్రదానం చేశారు. అదే స్కూలుకు చెందిన విజయకుమార్‌కు, నైతికకు బ్రౌన్ ఫోర్, కంచరపాలెం జివిఎంసి హైస్కూల్‌కు చెందిన అభిషేక్‌కు బ్రౌన్‌వన్ ప్రదానం చేశారు.

గ్రేడింగ్ పత్రాలతో విద్యార్థులు

30న సత్యశోధక్ మహాసభ, ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహాత్మా జ్యోతిరావుపూలే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 152 ఏళ్లయిన సందర్భంగా దళితవిముక్తి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన సత్యశోధక్ మహాసభను నిర్వహిస్తున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముందుగా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్, ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఆపరేషన్ లంగ్స్ కాదు.. స్టమక్

దుకాణాల తొలగింపుపై వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరంలో చిరు వ్యాపారుల కడుపు కొడుతూ జివిఎంసి చేపట్టిన తోపుడు బండ్లు, బడ్డీల తొలగింపుపై వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెజిహెచ్‌ను ఆనుకుని ఉన్న దుకాణాలు తొలగిస్తారని తెలిసి దక్షిణ వైసిపి శ్రేణులతో కలిసి సోమవారం ఆపరేషన్ స్టమక్ పేరుతో కెజిహెచ్ ఒపి ఎదుట రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నగరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న కారణంగా, దుకాణాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారానికి అధికారులు వాయిదా వేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జివిఎంసి అధికారులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దుర్మార్గమన్నారు. నమ్మి ఓటు వేసి గెలిపించినందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పేదల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. దుకాణాల తొలగింపులు ఆపకపోతే వారికి అండగా వైసిపి పోరాటం చేయడానికి సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొల్లవరపు జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ, దొడ్డి రామానంద్, జిల్లా కార్యదర్శి పద్మనాభ అమ్మాజీ, అభిరెడ్డి, అడివిషురెడ్డి దశమంతుల చిన్న తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆపరేషన్ లంగ్స్ పేరుతో చిరు వ్యాపారస్తులపై కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, నోటీసులు ఇవ్వకుండా దుకాణాలు తొలగించడం సరికాదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మరాజు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ భవానిశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, జివిఎంసి అధికారుల చర్యల వల్ల పేద కుటుంబాలు రోడ్డు పాలయ్యాయన్నారు. తక్షణమే ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు.

ఎజిఐఎఫ్ -2025 రోడ్ షో

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : అమెజాన్ ఇండియా గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ (ఎజిఐఎఫ్) మంగళవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థ ప్రతినిధి శ్రీవీర్ మాట్లాడుతూ, ప్రముఖ బ్రాండ్లు శామ్‌సంగ్, ఆపిల్, వన్ ప్లస్, ఐక్యూ వివో, షోవోమీ, రియల్‌మీ, లావా తదితర స్మార్ట్ ఫోన్లు, యాక్ససరీస్‌పై అతి తక్కువ ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్. నెం. 239/2019

వాది: కురిమెళ్ళ వెంకట నాగేంద్రరావు మరియు మరియొకరు
ప్రతివాదు్లు: కడిమి వరలక్ష్మి మరియు ఇతరులు

టు
డి4: కడిమి మల్లిబాబు, తండ్రి రమణ, హిందూ, వయస్సు 26 సంవత్సరాలు, వ్యవసాయం, కొంతం కొత్తూరు గ్రామం, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందువల్ల దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన 2025వ సంవత్సరం సెప్టెంబరు 25వ తారీఖున పగలు ఉ॥ 10:30 ని॥లకు స్వతహాగా లేక సరియైన బోగట్టా ఇవ్వబడిన వకీలు ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు వుద్దేశించియుండే దస్తావేజులన్నిటినీ నీ యొక్క స్టేట్‌మెంట్‌తో సహా ఆ రోజు హాజరుపర్చుటకు మాకు ఉత్తరవు చేయడమైనది.

పైన చెప్పిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించడమగునని మీరు తెలుసుకోవలసినది.

యలమంచిలి
తేది:22.09.2025 యల్లపు దాసుబాబు

సలుగు కృష్ణ శేఖర్, అడ్వకేట్
లింగాలతోటకాలనీ, పాయకరావుపేట
అనకాపల్లి జిల్లా సెల్ నెం. 9848354568

IN THE HON'BLE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.811/2023
Between:
Bank of Baroda, Asilmetta Branch, Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
Gottivada Ramesh ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Gottivada Ramesh, S/o. Late Surya Rao, R/at D.No.15-83/1, F-Block, Lakshmi Nagar,Baji Junction,Gopalapatnam, Visakhapatnam-530027.

Take notice that the above named plaintiff has filed suit against defendant for recovery of a sum of Rs.20,840/- (Rupees Twenty thousand eight hundred and forty only) together with subsequent interest and costs. Number of times the Hon'ble Court ordered notices to the defendant, through Court and by registered post, in all the times notices were returned unserved. Therefore, you are hereby summoned to appear in the above named Court and in the above numbered case on **06-10-2025** at **10:30 A.M** before the Hon'ble Court, either in person or through a pleader duly instructed and participate in the case proceedings, as other in your absence the matter will proceed with further.

(By Order of the Hon'ble Court)
B. TRINADHA RAO,
E. SRINIVASA RAO & B.S. LAKSHMI
Advocates, Visakhapatnam-20
Cell: 98482 14117

మౌలిక వసతులు కల్పించాలి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న చిన్నపాలెం ముస్లిములు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 77వ వార్డు పెదగంట్యాడ మండలం చిన్నపాలెం గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించాలని స్థానిక నూరి జామియా మసీదు ముస్లిమాబాద్ డెవలెప్‌మెంట్ వెల్‌ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర మైనార్టీమంత్రి ఎండి.ఫరూఖ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్‌టిపిసి, హిందూజా పవర్‌ప్లాంట్‌లకు భూములిచ్చిన తమకు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి నుంచి వెలువడే కాలుష్యంతో రోగాలతో బాధపడుతున్నామన్నారు. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామంలో షాదీఖానాకు శంకుస్థాపన చేసినా నేటికీ నిర్మాణం జరగలేదన్నారు. గ్రామంలో కల్యాణ మండపం నిర్మించాలని, ఎన్‌టిపిసి, హిందుజా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాలని, కాలుష్యంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సొసైటీ సభ్యులు రజాక్, సాధిక్, సలీం, నజీర్, హిమాం హుస్సేన్, గౌస్, అన్సార్ (చోటూ) ఉన్నారు.

వారసులకు ఉద్యోగాలివ్వాలని ధర్నా

ధర్నా చేస్తున్న జివిఎంసి ప్రజారోగ్య కార్మికులు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ వివిధ కారణాలతో నిలిచిపోయిన, మరణించిన కార్మికుల వారసులకు ఆప్కాస్ ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని మున్సిపల్ కార్మికుల యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, పని చేస్తూ మరణించిన, అనారోగ్యంతో బాధపడుతున్న, అరవై ఏళ్ల నిండిఉద్యోగాలనుండి తొలగించిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. అనారోగ్యంతో బాధపడుతూ దీర్ఘకాలం సెలవులలో ఉన్న కార్మికులను విధులలోకి తీసుకోవాలని, యూనియన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం పబ్లిక్ వర్క్స్ ఎఇఇ ఎన్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు కార్యకర్తలు కె.నాగరాజు, ఒ.లక్ష్మి, వి.పవన్‌కుమార్, ఎస్ రాజయ్య, డి.ధనుంజయ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన ప్రసాదానికి అనకాపల్లికి చెందిన సున్నం చంద్రకాంత్, అమృత దంపతులు రూ. 1,00,111 నగదు విరాళాన్ని సమర్పించారు. తమ కుటుంబ సభ్యులైన ఒక్షిత్, విక్రమ్‌చంద్ర పేరున నిత్యాన్నదానం చేయాలని కోరుతూ డొనేషన్ కౌంటరులో విరాళాన్ని అందజేసి, ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి సునీల్ కుమార్ ద్వారా బాండ్ స్వీకరించారు. అనంతరం స్వామి అంతరాలయ దర్శనం చేసుకుని, పర్యవేక్షణాధికారి బలువు సత్య శ్రీనివాస్ నుంచి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలను స్వీకరించారు.

జిఎస్‌టి ఉపసంహరణతో బీమాకు ధీమా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం సమీకరణ ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపైఉన్న 18 శాతం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని, ఇది ఎఐఐఇఎకి గొప్ప విజయం అని ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, అధ్యక్షులు ఎం.కామేశ్వరి అన్నారు. ఎల్‌ఐసి ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిఎస్‌టి రద్దుకు ఎఎల్ఐఇఎ 2004 నుంచి నిరంతర పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. 400కిపైగా ఎంపీలను ప్రత్యక్షంగా కలిసి జిఎస్‌టి వసూలు అన్యాయం అని వివరించినట్లు చెప్పారు. జిఎస్‌టి తొలగింపునకు సహకరించిన ఎంపీలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇంకా ఎల్‌ఐసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. బీమా రంగంలో ఎఫ్‌డిఐ 100 శాతం పెంపునకు, ఎల్‌ఐసి షేర్లు అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు, బిఎస్ఎన్‌ఇ యూనిట్ నాయకులు పాల్గొన్నారు.

గాజువాక : జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలపై జిఎస్‌సి పన్నును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభపరిణామమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కొత్త గాజువాకలోని షిప్‌యార్డ్ బ్రాంచి వద్ద జరిగిన కార్యక్రమంలో బేస్ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు ఇ.శ్రీనివాసరావు, సిహెచ్ నాగరాజు మాట్లాడుతూ బీమా రంగంలో 24 ప్రైవేట్ సంస్థలున్నా కూడా నేటికీ ఎల్‌ఐసి అగ్రగామిగా నిలుస్తుందని, ఇపుడు కేంద్రం నిర్ణయం బీమా రంగం అభివృద్ధికి దోహదపడేలా ఉందన్నారు .ఇది సమిష్టి పోరాటంతో సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ సిహెచ్ఎస్ శ్రీనివాసరావు, సిహెచ్ వైజయంతిమాల, సిహెచ్‌వివిఎన్ మూర్తి పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న ఎల్‌ఐసి యూనియన్ నేతలు

దసరాకు ఊరెళ్తున్నారా...ఇళ్లు జాగ్రత్త!

• విస్తృత అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-మధురవాడ : దసరా సెలవులకు సొంతూళ్లకు, విహారయాత్రలకు వెళ్లే నగరవాసులు తమ ఇళ్ల భద్రతలో తగు జాగ్రత్తలు పాటించాలని పిఎం.పాలెం క్రైం సిఐ బిఎస్ఎస్ ప్రకాష్ సూచించారు.ఇటీవల కాలంలో పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు పెరిగాయని, కట్టుదిట్టమైన భద్రత ఉన్న నివాసాల్లోనూ దొంగతనాలు జరుగుతుండడంతో పోలీసుశాఖాపరంగా పటిష్ట చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తత అవసరమన్నారు. అనుమానితుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు విలువైన వస్తువులను ఇంట్లో కాకుండా భద్రత ఉన్నచోట ఉంచాలని, బ్యాంకు లాకర్లలో ఉంచడం శ్రేయస్కరమన్నారు. ఇరుగుపొరుగు వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అపార్టుమెంట్లు, కాలనీ కూడళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలనన్నారు. అనుమానితుల సమాచారన్ని 0891 2721333, 9440904314, 8331041672 నెంబర్లకు అందించాలన్నారు. పోలీసులకు సమాచారమిస్తే గస్తీని పటిష్టం చేసి, అవసరమైన భద్రత కల్పిస్తామని సూచించారు. దీనిపై అపార్ట్‌మెంట్స్, కాలనీ వాసులతో అవగాహన సదస్సులతోపాటు ఆటోల్లో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నామని సిఐ ప్రకాష్ వెల్లడించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జీవించే హక్కును కాల రాశారు!

ప్రజాశక్తి- కొమ్మాది : ఆక్రమణల తొలగింపు పేరుతో నగరంలో చిరువ్యాపారులు, తోపుడుబళ్ల వర్తకుల జీవించే హక్కును కాలరాయడం దుర్మార్గమని చిరువర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద వీధి విక్రయదారులు భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాఫీగా సాగుతున్న తమ కుటుంబాల బతుకులను రోడ్డున పడేసి, ఆర్థికంగా, మానసికంగా కుంఉగదీయం దుర్మార్గమన్నారు. తమకు చట్టాలు, హక్కులున్నాయని, వాటిని అధికారులు, కూటమి పాలకులు అమలు చేయకుండా తమకు జరిగిన నష్టానికి పరిహారమివ్వాలనియ యథావిధిగా వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని,హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల వద్దకు వచ్చిన జెడ్‌సి కనకమహాలక్ష్మి, ఎసిసి, ఇఇలు వచ్చి, చిరువర్తకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కమిషనర్ దృష్టికి తీసుకెళతామన్నారు కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, నాయకులు పి.రాజుకుమార్, కార్యకర్తలు పి.వరలక్ష్మి, ఎన్ ఆదినారాయణ, సురేష్, ధనుంజయ రావు, ఆర్ రాజేశ్వరి, రమణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న వీధి విక్రయదారులు

నేరాలు ఘోరాలు

చోరీల కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను సిఐ వెల్లడించారు. పరవాడకు చెందిన గేదెల రాజశేఖర్ ఇటీవల అనకాపల్లి ఇన్‌కమ్ టాక్స్ వీధిలోని ఒక ఇంటిలో 4.5 తులాల బంగారు వస్తువులను అపహరించాడు. పిడినికాడ గ్రామంలోని ఒక ఇంటిలో దొంగతనం చేశాడు. వీటిపై అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యాన సుంకరమెట్ట ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చోరీ దొంగ దొరికాడు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు

ముందస్తు అరెస్టులు దుర్మార్గం

ప్రజాశక్తి-మధురవాడ : ఆక్రమణల తొలగింపుతో నష్టపోతున్న చిరువ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సోమవారం చేపట్టే నిరసనలో పాల్గొనకుండా తమను ముందస్తుగృహనిర్బంధం చేయడం సరికాదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, ఏరియా పార్టీ కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ మండిపడ్డారు. సిఎం చంద్రబాబు పర్యటన ఉందని తమను గృహనిర్బంధం చేయడాన్ని ఖండించారు. కమ్యూనిస్టులంటే చంద్రబాబు భయపడుతున్నారని ఆక్షేపించారు .

మహిళలకు వైద్యసేవలు అందించండి

వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశిత ప్రత్యేక వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వర రావు సూచించారు. సోమవారం కొబ్బరితోట, క్రాంతి నగర్, సిద్దేశ్వరం, పురుసోత్తపురం యుపిహెచ్‌సిలను సందర్శించి, పలు సూచనలు చేసారు. వచ్చేనెల 2 వరకు నిర్వహించే స్వస్థ్ నారీ సశక్త్ వైద్యశిబిరాల్లో భాగంగా మహిళలకు వివిధ రకాల సేవలను అందించాలని, ముఖ్యంగా నోరు, రొమ్ము, సర్వైకల్ కేనర్సర్‌పై స్క్రీనింగ్, కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. గర్భిణులు, మాతా శిశు ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, ప్రత్యేక వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆరోపణలకు తావులేకుండా వైద్యసేవలు అందించాలని ఆదేశించారు

పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించొద్దు

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి మాధవధార : సొంత నిధులతోనే పోర్టు ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పిపిపి పద్ధతిలో అభివృద్ధి పేరిట పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణను నిరసిస్తూ ఆసుపత్రి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 357 రోజులకు చేరుకున్న సందర్భంగా మాట్లాడుతూ, పోర్టు కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబసభ్యులు 35 వేల కుటుంబాలకు వైద్యసేవలు అందిస్తున్న పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరిస్తే వారికి వైద్యసేవలు దూరమౌతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పోర్టు ఆసుపత్రి ప్రయివేటుపరం కానివ్వబోమని, ఎవరైనా టెండర్లకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిఎన్ మూర్తి, కె.రాము, జిసిహెచ్‌వై నాయుడు, ఎంవి రాఘవులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి చిరు వర్తకుల సమస్యలు

వీధి వర్తకులతో మాట్లాడుతున్న జెడ్‌సి శంకరరావు

ప్రజాశక్తి- వేపగుంట /పెందుర్తి : జివిఎంసి వేపగుంట జోనల్ కార్యాలయంలో తోపుడుబళ్ల కార్మికులతో జోనల్ కమిషనర్ శంకరరావు సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌సి మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు, జన సమూహం ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే దుకాణాలను మాత్రమే తొలగిస్తామని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయన్నారు. తోపుడుబళ్ల కార్మికులకు రక్షణకు చట్టం ఉందని, వారి అభ్యంతరాలు, సమస్యలను తెలియజేస్తే జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళతామని భరోసానిచ్చారు. సమావేశంలో డిసిపి రామ్మోహన్, ఎసిపి రామలింగారెడ్డి, టిపిఒ గోపన్న, ఎపిడి ఒ.చిరంజీవి, గోపాలపట్నం జోన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి బి వెంకటరావు, తోపుడు బళ్ల కార్మిక సంఘం జోన్ అధ్యక్షుడు జి మురళీకృష్ణ కార్మికులు పాల్గొన్నారు

తర్లువాడ నిర్వాసితులకు న్యాయం చేస్తా

సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి-మధురవాడ : గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడలో భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసానిచ్చారు. సోమవారం నగరానికి వచ్చిన చంద్రబాబుకు కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గూగుల్ డేటా సెంటర్‌కు తర్లువాడ రైతులు భూములిచ్చి పూర్తి సహకారం అందిస్తున్నారని, అదే సమయంలో అదనపు పరిహారం కోసం కోరుతున్నారన్నారు. రివిజన్‌లో చుట్టుపక్కల గ్రామాల భూమలు మార్కెట్ ధర పెంచినా, తర్లువాడకు ఆ పెంపు వర్తించలేదని, దీంతో తాము నష్టపోతున్నామని కలెక్టర్ అధ్యక్షతన అవార్డు సమావేశంలో వారు ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే గంటా తీసుకెళ్లారు. గంభీరం ఐఐఎం. తరహా సెటిల్మెంట్ కావాలని తర్లువాడ రైతులు కోరుతున్నారని వివరించారు.

దీనిపై చంద్రబాబు స్పందిస్తూ. రైతుల విజ్ఞప్తిని పరిశీలించి పరిహారం పెంపుపై ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని, అలాగే నిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగావకాశాలు, జీవనోపాధికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేశారు. గూగుల్ డేటా సెంటర్‌కు త్వరితగతిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

సరళీకృత జిఎస్‌టితో ఆర్థిక వెసులుబాటు

అవగాహనా ర్యాలీలో: కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రాణా

ప్రజాశక్తి -సీతమ్మధార : సరళీకృతి జిఎస్‌టితో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం ఇంతటి ఆర్థిక వెసులుబాటు కల్పించిందిన కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రాణా అన్నారు. సోమవారం అక్కయ్యపాలెంలో సరళీకృత జిఎస్‌టిపై బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు నేతృత్వంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. దుకాణ యజమానులు, సామాన్యులతో ముచ్చటించారు. అనంతరంమాట్లాడుతూ దేశప్రజలకు కేంద్రం దసరా, దీపావళికి గొప్ప బహుమతి ఇచ్చిందన్నారు. ఎపి బిజెపి అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ స్వదేశీ వస్తువు లు వినియోగించాలని పిలుపు ఇచ్చారు. అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ కె .సురేంద్రమోహన్, యు. సుజాత రాజు పాల్గొన్నారు.

రామకృష్ణకు సాహితీ కిరీటి పురస్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : నిరంతర సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాహితీ సంస్థ, శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో విశాఖపట్నానికి చెందిన కవి గేయ రచయిత గాయకుడు పట్నాల రామకృష్ణారావుకు, సాహితీ కిరీటి పురస్కారం వరించింది. ఈనెల 28న . ఆదివారం హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక కవితోత్సవంలో పురస్కారాన్ని అందజేయనున్నారు. పురస్కార గ్రహీత .పట్నాల రామకృష్ణారావుకు రైటర్స్ అకాడమీ, విశాఖ రచయితల సంఘం, క్రియేటివ్ కామెడీ క్లబ్, మేడా బుజ్జమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్లు, సభ్యులు అభినందనలు తెలిపారు.

పట్నాల రామకృష్ణారావు

పెదగంట్యాడ ఉక్కు హెల్త్ సెంటర్‌లో

వైద్యసేవల కుదింపుపై నిరసన

ధర్నాలో మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెదగంట్యాడ హెల్త్ సెంటర్‌లో వైద్యసేవలను కుదిస్తూ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్ నిరసిస్తూ సోమవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ఆరోగ్యకేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం మాట్లాడుతూ, పెదగంట్యాడ గంగవరం, గాజువాక ప్రాంతంలో మూడు వేలమందికి పైగా కార్మికులు, వారి కుటుంబసభ్యులకు అవసరమైన వైద్యసేవలను అందించేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ సొంత స్థలంలో నిర్మించి, హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తోందన్నారు. అవసరమైన మందులతో రౌండ్‌దిక్లాక్ ఉత్తమసేవలు అందించే ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఇపుడు కేవలం జనరల్ షిఫ్ట్‌లోనే, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించేలా ఉక్కు యాజమాన్యం సర్క్యురల్ జారీ చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి యు .రామస్వామి మాట్లాడుతూ అగనంపూడి, వడ్లపూడి గంగవరం, నిర్వాసిత కాలనీల్లో స్టీల్‌ప్లాంట్ తరపున కొత్తగా హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కార్మిక యూనియన్లు డిమాండ్ చేస్తుంటే ఇపుడు ఉన్న సెంటర్‌లో వైద్యసేవలను కుదించి నిర్వీర్యం చేయాలనుకోవడ సరికాదన్నారు. స్టీల్ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులు అత్యవసర పరిస్థితుల్లో వైద్య అవసరాలకు ఎక్కడకు వెళ్లాలని ప్రశ్నించారు. ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే యాజమాన్యం బిల్లులను చెల్లించడం లేదని, ఇలాగైతే కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పాలౌతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, వారి కుటుంబాలప్రాణాలతో చెలగాట మాడడంపై మండిపడ్డారు. స్టీల్‌యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోవాలని, సరిపడా వైద్యులు, అవసరమైన మందులతో పెదగంట్యాడ్ హెల్త్ సెంటర్‌లో 24గంటల సేవలు మెరుగైన వైద్యం అందు బాటు లో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పెదగంట్యాడ ఏరియా సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు వెంకటరావు, పాల అప్పల రెడ్డి, నాయకులు నూకరాజు, కనకరాజు, డి వెంకటరావు, అప్పలరాజు, నమ్మి రమణ దీనబంధు పాల్గొన్నారు.

గోయాజ్ జ్యువెలరీ షోరూం ప్రారంభం



గాజువాకలో షోరూం ప్రారంభిస్తున్న సినీ నటి రితిక

ప్రజాశక్తి -గాజువాక : దేశంలోనే అతిపెద్ద లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ స్టోర్ గోయాజ్ గాజువాకలో 16వ బ్రాంచ్‌ను సోమవారం ప్రారంభించింది. షోరూం ప్రారంభించిన సినీ హీరోయిన్ రితికా నాయక్ మాట్లాడుతూ సిల్వర్ జ్యువెలరీ కేటగిరీలో కొత్త నిర్వచనాన్ని సృష్టిస్తున్న గోయాజ్, దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందన్నారు. గోయాజ్ గాజువాక షోరూం జ్యువెలరీ కలెక్షన్స్ ప్రత్యేకమని, తనకెంతో నచ్చాయన్నారు.

గోయాజ్ అధినేత ప్రియాంక మాట్లాడుతూ విస్తృతమైన అద్భుతమైన కలెక్షన్లతో గాజువాక స్టోర్ విలాసవంతమైన సిల్వర్ జ్యువెలరీ షాపింగ్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. పెళ్లిళ్ల, పండుగలు, అన్ని సందర్భాలకు అవసరమైన ఆభరణాలు ఒకేచోట అందుబాటులో ఉన్నాయన్నారు. స్టోర్ ప్రారంభం, దసరా సందర్భంగా ఈనెల 22 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు ప్రత్యేకమైన ఆఫర్స్ ప్రకటించారు. రూ.లక్ష విలువైన సిల్వర్ జ్యువెలరీ కొనుగోలుపై రూ.50వేలు, అలాగే రూ.50వేలు కొనుగోలుపై రూ. 25వేలు, అంతేకాకుండా రూ.25వేలు కొనుగోలుపై రూ.12,500 విలువైన సిల్వర్ జ్యువెలరీ (ఎంపిక చేసిన డిజైన్స్) ఉచితమన్నారు.

13 గంటల పని దినాన్ని ఉపసంహరించాలి

ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి- ములగాడ: మేడే స్ఫూర్తితో త్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 13గంటలకు మార్చడానికి వ్యతిరేకిస్తూ, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు వద్ద సోమవారం కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్షణమూర్తి మాట్లాడుతూ 8 గంటల పని దినాన్ని 13 గంటలకు పెంచుతూ, సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం దుర్మార్గమన్నారు 8 గంటల పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, భద్రత కల్పన ఇబ్బందులుపడుతూ పనిచేస్తున్న నేపథ్యంలో ఇపుడు పనిభారాన్ని మరింత పెంచడం, కార్మికులపై మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. లేబర్‌కోడ్స్‌తో ఇప్పటికే కార్మికులను కట్టు బానిసలను చేయాలని చూస్తున్న ప్రభుత్వాలు, ఇపుడు పనిగంటలు పెంపుతో మరింత కుదేలు చేయడం అన్యాయమన్నారు. తక్షణమే 13గంటల పనిదినాల బిల్లును ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కె.పెంటారావు అధ్యక్షత నిరసనలో కాంటాక్ట్ కార్మికులు వై.గంగాధర్, గంటా. దాసు, ఏసుబాబు, రాజేష్ రామకృష్ణ, నీలయ్య,కుమార్ కోటి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా పూజలు

ప్రజాశక్తి మాధవధార : మాధవధార సీతన్న గార్డెన్స్‌లో కనకమహాలక్ష్మి, గాయత్రీ దేవి, కనకదుర్గాలమ్మ అమ్మవార్ల ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సనపల కీర్తి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవార్లను విశాఖ ఎంపీ శ్రీభరత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్‌ను ఆలయ ధర్మకర్త సనపల కీర్తి అమ్మవారి ఫోటో, ప్రసాదం అందజేశారు.

రైల్వే విశ్రాంత ఉద్యోగి

పంచాది రామారావు మృతి



పంచాది రామారావు (ఫైల్)

ప్రజాశక్తి - మాధవధార : రైల్వే విశ్రాంత ఉద్యోగి పంచాది రామారావు (94) అనారోగ్యంతో విశాఖ నగరంలోగల కళా హాస్పిటల్‌లో సోమవారం ఉదయం మృతిచెందారు. కొంతకాలంగా వృద్ధాప్య, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తె డాక్టర్ పి.కళావతి, అల్లుడు డాక్టర్ పివి.రమణమూర్తి విశాఖలో చాలా కాలంగా వైద్యసేవలందిస్తున్నారు. శ్రీకాకుళం రైతాంగ ఉద్యమ నాయకులు పంచాది కృష్ణమూర్తి రామారావుకు స్వయానా తమ్ముడు. ఉద్యమ సమయంలో కృష్ణమూర్తి, అతని సహచరులు రహస్య జీవితం గడిపినప్పుడు వారికి విశాఖలో రామారావు ఆశ్రయం కల్పించారు.

పలువురు నివాళి

రామారావు పార్థివదేహాన్ని మాధవధారలోగల ఆయన స్వగృహానికి తీసుకురాగా అక్కడ ఆయన బంధువులతో పాటు మాధవధార గ్రామ ప్రజలు, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం రామారావు స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా బెలమాంకు పార్థివ దేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

మార్కెటింగ్‌లో మంచి ఉపాధి

ఇండక్షన్ మీట్‌లో మాట్లాడుతున్న వక్త

ప్రజాశక్తి -తగరపువలస: మార్కెటింగ్ రంగంలో ప్రస్తుతం అపారంగా ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజయనగరం, గురజాడ జెఎన్‌టియు ఎంబిఎ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి శ్రీదేవి అన్నారు.సోమవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబిఎ, ఎంసిఎ ఫస్టియర్ విద్యార్థుల ఇండక్షన్ మీట్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, సమాజంలో మంచీ, చెడులను బేరీజు వేసుకోవాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సమయ పాలన, కెరీర్ ప్లానింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ యు రాము, కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి పి సత్యనారాయణ, డాక్టర్ రాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు

వైసిపి అనుబంధ రాష్ట్ర కమిటీల్లో

ఆరిలోవ నాయకులకు చోటు

అల్లంపల్లి రాజబాబు

విక్టర్

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రస్థాయిలో వైసిపి అనుబంధ కమిటీల్లో ఆరిలోవ నాయకులు ఇద్దరికి చోటు కల్పించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ఆదేశాలతో ఆరిలోవ 12వ వార్డుకు చెందిన వైసిపి సీనియర్ నేత అల్లంపల్లి రాజబాబును పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. 13వ వార్డుకు చెందిన గూడపాటి విడబ్ల్యూ జోసఫ్(విక్టర్)ను ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమకు పార్టీ పదవులు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశారు. అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి, పేద మధ్యతరగతి ప్రజలకు బడుగులకు సేవ చేస్తామన్నారు. తమకు పదవులు రావడానికి సహకరించిన పార్టీ అధిష్టానం, జిల్లా, స్థానిక నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

24న చలో విశాఖ డెయిరీని జయప్రదం చేయండి

గ్రామాల్లో విస్తృత ప్రచారం

నినాదాలు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-కశింకోట : పాల రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి పాల రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎస్. బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. కశింకోట మండలంలోని బయ్యవరం, తేగాడ, గంటవానిపాలెం, కొత్తపల్లి బుచ్చెయ్యపేట, తాళ్లపాలెం, పి.సోమవరం, నరసింగపల్లి, ఎ.ఎస్.పేట, పిసినికాడ తదితర గ్రామాలలో రైతులను కలిసి చలో విశాఖ డెయిరీపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి కార్యక్రమం కరపత్రాలు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాల రైతుల కృషి వలన విశాఖ డెయిరీ మిగిలిన డెయిరీలను తట్టుకొని నిలబడి ఇప్పటివరకు అభివృద్ధి పథంలో నడిచిందని తెలిపారు. ఈ మధ్యకాలంలో డెయిరీ పాలకవర్గంలో అవినీతి విపరీతంగా పెరిగిందని, డెయిరీ ఛైర్మన్‌తో సహ పాలకవర్గం మొత్తం తమ స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖ డెయిరీని వాడుకుంటూ రైతులను నష్టాల పాలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ డెయిరీ ఉత్పత్తుల ధరలు బయట మార్కెట్‌లో అధికంగా ఉండగా, రైతులకు మాత్రం అతి తక్కువ ధర చెల్లిస్తున్నారని తెలిపారు. హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటర్‌కు రూ.10 పెంచాలని, ప్రతి మూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, చనిపోయిన రైతు కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, పశువులకు ఉచిత బీమా, మందులు, దాణా 75శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వడ్డాది : పాడి రైతుల సమస్యలను విశాఖ డెయిరీ పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌వి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు 24న జరుగు చలో విశాఖ డెయిరీ కార్యక్రమం గోడ పత్రికలను సోమవారం వడ్డాదిలో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పినపాత్రుని సాంబశివరావు, అప్పారావు, నరసింహులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నేతలు, రైతులు

గంజాయి కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

100 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని ఎండపల్లి గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఉండగా రెండు కార్లు ఒక అశోక్ లైలాండ్‌తో 100 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు నర్సీపట్నం డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడించారు, వాహనాల నుంచి గంజాయి మూటలను మారుస్తూ ఉండగా నక్కపల్లి సిఐ రామకృష్ణ, స్థానిక ఎస్సై రమేష్ పట్టుకున్నట్లు తెలిపారు. .

ముంపు ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట జంక్షన్ దగ్గర ముంపు ప్రాంతాన్ని సోమవారం ఆర్ అండ్ బి మాడుగుల జేఈ సాయి శ్రీనివాస్ పరిశీలించారు. ఇక్కడ ఇటీవల రోడ్డు ఎత్తు చేయడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక స్థానిక కాలనీలో ఇళ్లను ముంచెత్తుతుంది. ఏమాత్రం వర్షం కురిసినా ఇళ్లల్లోకి నీరు ప్రవేశిస్తుంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో అంటు వ్యాధులు ప్రబలి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సమస్యను వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన జేఈకి తెలియజేశారు. దీంతో ముంపు ప్రాంతాన్ని జేఈ పరిశీలించారు. నీరు పోయేలా కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. జేఈ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. టిడిపి నేత సాయం శేషు పాల్గొన్నారు.

ప్రమాదకర జంక్షన్ల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా ప్రమాదకరంగా ఉన్న కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం జంక్షన్, నర్సింగబిల్లి, ఎన్‌జీ.పాలెం జంక్షన్లలోనిబ్లాక్ స్పాట్స్‌ను సీఐ ఎ.స్వామినాయుడు, అనకాపల్లి మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ లీలాప్రసాద్, హైవే అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణాలను విపులంగా పరిశీలించారు. వాటిని నివారించడానికి తీసుకోవలసిన చర్యలను గుర్తించి సంబంధిత శాఖలకు సూచనలు చేశారు. స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ సైన్ బోర్డులు, రోడ్డు విస్తరణ వంటి అంశాలను సమీక్షించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హైవే అధికారులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో విద్యార్థులకు వికసిత సుమమం, ఉమెన్ డెంటల్ కౌన్సిల్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యాన కెరీర్ గైడెన్స్ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే క్యాన్సర్‌పై అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనుపమ, భారతం, డాక్టర్ శిరీష, డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవడంపై అవగాహన కల్పించారు. స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపల్ రూపానంది, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు సంస్కృతి విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : తమిళనాడులోని తిరుచిరాపల్లి 16వ సౌత్ జోన్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సంజయ్ రెడ్డి, లిత్విక్, హర్షిత నాయకర్ పాల్గొంటున్నారు. ఈ పోటీలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. ఆమె విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఎంపీడీవో మీనా కుమారి సోమవారం పర్యటించారు. అనంతరం పెనుగొల్లు ధర్మవరం, పెదగుమ్ములూరు గ్రామాలలో డోర్ టు డోర్ శానిటేషన్ కార్యక్రమాలు అమలు జరుగుతున్న తీరును గమనించి తడి పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినయ్ విద్యా సంస్థల్లో దసరా సంబరాలు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండల కేంద్రంలోని వినయ్ విద్య సంస్థల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేవి వేషధారణతో ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. విద్యార్థుల ప్రతిభను స్కూల్ కరస్పాండెంట్ బత్తుల వాసు అభినందించారు.

మోతాదుకు మించి ఎరువులు వినియోగించరాదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వరి పంటలో మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి భవాని చెప్పారు. మండలంలోని పలు గ్రామాలలో శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. ప్రస్తుతం వరి మళ్ళల్లో ఆకుముడత పురుగు ఆశించిందని, కొన్ని పొలాల్లో పొటాషియం లోపం గమనించామని తెలిపారు. కొండకర్ల, తిమ్మరాజుపేట, హరిపాలెం, జగ్గన్నపేట గ్రామాలలో పరిశీలించారు. కార్యక్రమంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యసేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు, వ్యవసాయ అధికారి శంకర గోవింద్, అభ్యుదయ రైతు శరగడం పరశురాం పాల్గొన్నారు.

24, 25న సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండల పరిషత్తు సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇరు మండలాల ఎంపిపీల ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీలలో ఉదయం 9.30 నుండి 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఛాయా సుధా తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో రూ.15 లక్షల పంచాయతీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, ఎంపీటీసీ ఓమ్మి వెంకట్రావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు బలిరెడ్డి సంతోషి ,యలమర్తి బుజ్జి, వైసిపి నాయకులు పల్లా అప్పారావు, కలవాలపల్లి సత్యనారాయణ, నందవరపు శ్రీనివాసరావు, నారపిన్ని శ్రీనివాసరావు, బర్ల వెంకునాయుడు, పల్లా వెంకునాయుడు, దళిబోయిన పైడిరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ-గవర్నెన్స్ సదస్సు ప్రారంభోత్సవ సమావేశానికి సోమవారం విశాఖపట్నం నేవెల్ పోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్దకు విచ్చేసిన సందర్భంగా మాజీ శాసన మండలి సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

చంద్రబాబుకు నమస్కరిస్తున్న నాగజగదీష్

ప్రమాదకర కల్వర్టు వద్ద సిఐటియు శ్రమదానం

కల్వర్టు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో గోవాడ సమీపంలో గుడ్డిడి మధుం వద్ద కల్వర్టు రక్షణ గోడల కూలి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దపెద్ద తుప్పలు పెరిగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆ కల్వర్టు వద్ద ఏపుగా పెరిగిన తుప్పలను సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, రైతు నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ నేతృత్వంలో కార్మికులు సోమవారం శ్రమదానం చేసి తుప్పలను తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో సిఐటియు జెండాలను కట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చోడవరం నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో పెద్దపెద్ద గోతులతో రోడ్డన్నీ ధ్వంసమై ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా కూటమి ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. కల్వర్టు వద్ద రక్షణ గోడలు కూలిపోయిన చోట కనీసం రేడియం స్టిక్కర్లతో హెచ్చరిక బోర్డులు కూడా ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల కాలంలో అనేకమంది ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలు పాలయ్యారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లు, కూలిన కల్వర్టులు పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : స్త్రీ శక్తి పథకంతో నష్టపోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఏడాదికి రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రం రాంబిల్లిలో సోమవారం ఆటో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విపరీతమైన చలానాలు, పెనాల్టీలు, ఇన్సూరెన్సులు వసూలు చేస్తున్న జీవో నెంబర్ 21ను రద్దు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రుణ సౌకర్యం కల్పించాల కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎన్ నారాయణ రావు, పైడ్రాజు, శ్రీను, అప్పారావు, చంటి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి దేవుడునాయుడు

ఫ్లైయాష్ లారీల తనిఖీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు నేతృత్వంలో, ఎన్‌టిపిసి డైక్ నుండి కలపాక మీదుగా దేశపాత్రునిపాలెం వైపు వెళ్తున్న ఫ్లైయాష్ లారీలను సోమవారం పోలీసులు తనిఖీ చేశారు. యాష్ లీకేజ్ లేకుండా సరైన తార్పాలిన్ కట్టడం, బాడీ పరిమితిలో సరిపడే ఎత్తులో మాత్రమే లోడ్ వేయడం చేయాలని సూచించారు. కొన్ని లారీలు సైడ్స్ వద్ద పై యాష్ బుగ్గు రోడ్డు మీద పడుతున్నట్లు గుర్తించారు. తడిగా ఉన్న యాష్‌ను రవాణా చేసే సమయంలో లీక్ కావడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన కొంతమంది డ్రైవర్లపై జరిమానాలు విధించారు. కొంతమంది లారీ డ్రైవర్లు రాత్రిపూట దేశపాత్రునిపాలెం రహదారి గుండా కాకుండా, గొర్లివానిపాలెం, పరవాడ మార్గం ద్వారా లంకెలపాలెం వైపు వెళ్తున్నారని పోలీసులు గుర్తించారు. ఎవరికైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రమాద నివారణ, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ రక్షణ కోసం భవిష్యత్తులో ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా, తరచుగా కొనసాగిస్తామని పోలీసులు వెల్లడించారు.

స్థల పరిశీలన చేస్తున్న బాబి, మెడికల్ ఆఫీసర్ తదితరులు

వెల్నెస్ సెంటర్‌కు రూ.42 లక్షల మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల మేజర్ పంచాయితీకి ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా తుమ్మపాల-1 వెల్నెస్ సెంటర్ నిర్మాణం నిమిత్తం రూ.42లక్షలు మంజూరైనట్లు టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు(బాబి) తెలిపారు. గ్రామంలో సోమవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి, ఈవో ఈశ్వరరావు, వీఆర్వో ఎరుకు నాయుడు, సర్వేయర్‌లతో ఆసుపత్రి నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. త్వరలోనే ఆసుపత్రి నిర్మాణం పనులు ప్రారంభం అవుతాయని, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నడిపల్లి బోసుబాబు, పాల్గొన్నారు.

అందరి సహకారంతో బ్యాంక్ అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (అన్నపూర్ణ బ్యాంకు) అందరి సహకారంతో అభివృద్ధి చెందినట్లు ఆఫీషియల్ పర్సన్ ఇంచార్జ్ వివివి సత్యకుమార్ తెలిపారు. పిఏసిఎస్ ఆవరణలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు షేరుధనంపై 10శాతం డివిడెంట్ ఇస్తున్నట్లు చెప్పారు. సకాలంలో రుణం చెల్లించిన సభ్యులు ఎవరైనా చనిపోతే, వారికి గతంలో దహన ఖర్చుల నిమిత్తం ఇస్తున్న రూ.6000ను సభ్యుల కోరిక మేరకు రూ.8000కు పెంచినట్లు తెలిపారు. సంఘ సీఈఓ బడ్జెట్, ఆడిట్ రిపోర్ట్ చదివి వినిపించగా ఆమోదించారు. సంఘం నుండి రుణం తీసుకోవాలంటే భూమి తాలూకా వివరాలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో చార్జ్ డిక్లరేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, రుణం చెల్లించిన తర్వాత క్యాన్సిల్ చేసుకుంటే సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి రద్దు చేయుటకు చాలా వ్యయం అవుతుందని, ఈ పద్ధతిని రద్దు చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో బొడ్డపాటి చిన్న రాజారావు, పీలా బుజ్జి, పీలా జగ సత్యనారాయణ, చదరం ఆదినారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో కేజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ రామ కొండలరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయం నుంచే యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. గ్రామస్తులు, స్థానిక యువత శిబిరంలో చురుకుగా పాల్గొనడం గ్రామానికి ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు అభినందించారు.

నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కాయి. ప్రభుత్వం సోమవారం నుండి దసరా సెలవులు ప్రకటించగా, ప్రయివేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ సెలవు దినాలలో పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి హెచ్చరించినప్పటికి ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పెడ చెవిన పెట్టడం చూస్తే అధికారులకు, యాజమాన్యాలకు మధ్య వున్న అవినాభావ సంబంధాలు అర్థమౌతున్నాయి. ఈ విషయంపై ఎంఇఓ కర్రి శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా, ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పాఠశాల నుండి సాయంత్రం తిరిగి వస్తున్న విద్యార్థులు

రాస్తా సమస్యపై రెవెన్యూ అధికారుల పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ రెవెన్యూలో భూముల రీ-సర్వే ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలపై 'భూ రీ సర్వేలో గందరగోళం' శీర్షికన సోమవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మండల సర్వేయర్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామన్న, రావాడ వీఆర్‌ఓ రమణ, గ్రామ సర్వేయర్లు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేశారు. 413, 412, 411 సర్వే నెంబర్లలో సరిహద్దులో ఉన్న పూర్వపు రాస్తాలను పరిశీలించారు. రాస్తా మొత్తం సర్వే నెంబర్ 413లోని జిరాయితీ భూమిలో ఉండడంతో సంబంధిత రైతులు అభ్యంతరం తెలిపారు. అయితే పూర్వం నుండి నేటికీ వాడుతున్న రాస్తాను రీ-సర్వేలో గుర్తించాల్సి ఉందని, భూమిపై యజమానికి హక్కు ఉన్నప్పటికీ, పూర్వం నుండి వాడుతున్న రాస్తాను అడ్డుకోవడం సాధ్యం కాదని, రాస్తాలో రాకపోకలకు అడ్డుకుంటే చట్టంలోని ఈజ్‌మెంట్ రైట్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల సర్వేయర్ శ్రీనివాస్ హెచ్చరించారు. రైతుల సమక్షంలో ఆర్ఐ రామన్న స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ప్రస్తుత రీ-సర్వేలో ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, రాస్తా సమస్యపై తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎఫ్ఎంబి పరిశీలిస్తున్న మండల సర్వేయర్ శ్రీనివాస్

రైతులను మోసం చేసిన ఎంపీ సిఎం.రమేష్

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకుంటానని ఎన్నికలకు ముందు వాగ్దానం చేసి గెలిచిన అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ నేడు ఆ విషయాన్ని పట్టించుకోకుండా రైతులను మోసం చేశారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రమేష్‌కు ఓటు వేస్తే జిల్లాకు చెటు తెస్తుందని ముందుగానే తాము చెప్పామని, నేడు అదే జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది మహాజన సభ నిర్వహించకపోవడం, క్రషింగ్‌పై నీలనీడలు కమ్ముకోవడంపై ఎంపీ సిఎం.రమేష్, ఎమ్మెల్యేలు రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెరకు రైతులు, కార్మికులకు ఇవ్వాల్సిన రూ.30 కోట్ల బకాయిల విషయాన్ని కూడా ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తన పోరాటాలు వల్లనే సుగర్ ఫ్యాక్టరీ నడుస్తుందని పగల్బాలు పలికిన జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు నేడు కానరాకుండా పోయారని ఎద్దేవా చేశారు. ఇటువంటి నాయకులను నమ్ముకొని మూడు నియోజకవర్గాల రైతులు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీని చరిత్ర కాలగర్భంలో కలిపేయకుండా తక్షణమే ప్రభుత్వం, ఎంపీ చొరవ తీసుకొని ఆధునీకరించి, క్రషింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు

రైవాడ ఎడమ కాలువ నుండి నీటి సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ ఎడమ కాలువ ప్రధాన తూము షట్టర్ల మరమ్మతు పనులు చేస్తుండగా సోమవారం ఒక ఇనుప గేటు (షట్టరు) కిందకు జారిపోయింది. దీంతో ఈ కాలువ ద్వారా ఆయకట్టుకి సాగునీటితో పాటు విశాఖ మహా నగర పాలక సంస్థకు తాగునీటి సరఫరాకు తాత్కాలికంగా ఆటంకం కలిగింది. ఈ షట్టరుని ఇంటెక్ చాంబర్ లోపల ఇనుప గొలుసుల సహకారంతో బయటకు తీస్తుండగా పెద్ద శబ్దంతో నీటిలో పడిపోయింది. ఈ షట్టరు ఎడమ చాంబర్ మదులకు అడ్డంగా ఉండిపోయింది. దీంతో అక్కడే ఉన్న జలాశయ డీఈఈ సత్యనారాయుడు వెంటనే స్పందించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. నీటిలో ఇంటెక్ చాంబర్ మదుంకి అడ్డంగా ఉండిపోయిన షట్టరుని బయటకు తీయించే పనుల్ని ముమ్మరం చేశారు. రెండు షట్టర్లలో ఒక షట్టరు మరమ్మతులు పూర్తయిన తరువాత రెండవ షట్టరు మరమ్మతు చేపట్టనున్నారు. మదుముకు అడ్డంగా ఉండిపోయిన షట్టరు తీయించి తాగు, సాగునీటి సరఫరాకు డోకా లేకుండా చేస్తామని డీఈఈ తెలిపారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం ఆపాలి

ప్రజాశక్తి-పరవాడ : ఏపీ ప్రభుత్వం వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేట్ వారికి అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కూండ్రపు కృష్ణంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నిర్ణయంతో ఎంబీబీఎస్ కోర్సుల్లో పేద విద్యార్థులుగా అవకాశాలు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు వంటి అభ్యంతరాలుంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణరావు సూచించారు. రాజకీయ పార్టీల నేతలతో నెలవారీ సమావేశాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తమ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరించిన ఫార్మాట్‌లో ఉన్న బిఎల్ఎల సమాచారాన్ని ప్రభుత్వానికి అందించాలని, ఇప్పటికే ఉన్న వివరాలను సవరించిన బిఎల్ఏ -2 ఫార్మాట్‌లో సంబంధిత ఈ ఆర్వోలకు వెంటనే అందించాలని కోరారు. కొత్త ఓటర్లను చేర్చడాన్ని దృష్టిలో ఉంచుకుని, అన్ని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులకు 1150 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలలో కొత్త భవనాలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాలను తయారు చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి, బిజెపి, వైసీపీ, ఆప్, సి.పి.ఎం పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, రమేష్, కె.హరినాధబాబు, సూరిబాబు, ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇవిఎం గోదాముల వద్ద ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. నెలవారీ తనిఖీలో భాగంగా జిల్లా ఎస్‌పి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను సోమవారం ఆమె పరిశీలించారు. గోదాముల వద్ద భద్రతా పరిస్థితులను పరిశీలించి, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి అమర్చిన సీళ్లను పరిశీలించారు. లాగ్ బుక్ నిర్వహణ, ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, జిల్లా ఎన్నికల విభాగం సిబ్బంది, తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్, ఆప్, సిపిఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత అడ్మిషన్ రిజిస్ట్రేషన్ కొరకు, మొదటి విడతల్లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా మిగిలిపోయిన విద్యార్థులు ఈ క్రింది గ్రూపులలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. బీఎస్సీ జువాలజీ హానర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ హానర్స్, బీఎస్సీ ఫిజిక్స్ విత్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్, బిఎ ఎకనామిక్స్ హానర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్ గ్రూపులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కొరకు అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ నారాయణ మూర్తి 8247470250, కన్వీనర్స్ డాక్టర్ మలిబాబు 9966545448, డాక్టర్ రాధాకృష్ణ 8143848280 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

చెక్కు అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో నరసింగబిల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదశాత్తు మరణించిన టీడీపీ క్రియాశీలక సభ్యుడు కరణం సత్యారావు కుటుంబానికి టిడిపి బీమా నుండి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర అర్బన్ అండ్ ఫైనాన్స్ ఇన్వెస్టెకర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సోమవారం మృతునికి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబానికి చెక్కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయలు మురళి, ఉగ్గిని రమణమూర్తి, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, షేక దర్గా, నిరంజన్ కుమార్, జెర్రిపోతుల నూకినాయుడు, కొన రమణ పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 126 అడుగుల వినాయకుని నిమజ్జనోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. 25 రోజులుగా పూజలు అందుకున్న గణనాథుని భక్తుల నడుమ ఫైర్ ఇంజిన్‌ల సహాయంతో అక్కడే నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డ్రోన్ సహాయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ సిఐ వెంకట నారాయణ, టౌన్ సిఐ విజయకుమార్‌ల ఆధ్వర్యంలో బందోబస్త్ ఏర్పాటు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్‌డిఎస్ఎస్ బ్రేకర్ పనుల కారణంగా తుమ్మపాల సెక్షన్, 33/11 కేవీ అల్లిఖానుడిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఈనెల 24న ఉదయం 10 నుండి సాయంత్రం 3గంటల వరకు 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు అందరూ సహరించాలని కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 18 గ్రామాల్లో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురంలో రహదారుల విస్తరణలో భాగంగా విద్యుత్తు మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్తు తరఫున నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అచ్యుతాపురం, మోసయ్యపేట, చౌడపల్లి, రామన్నపాలెం, వెదురువాడ, గొర్లె ధర్మవరం, సెజ్ కాలనీ, వెంకటాపురం తదితర గ్రామాలలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

గిరినాగు హల్‌చల్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ కెనాల్ సమీపంలో సోమవారం గిరినాగు హల్ చల్ చేసింది. దీంతో స్థానికులను భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే ఈస్టన్ ఘాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ బృంద సభ్యులకు సమాచారం అందించారు. బృంద సభ్యుడు కృష్ణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు గంటసేపు శ్రమించి రక్త పొడగను మింగి కదలని స్థితిలో ఉన్న ఏడు అడుగుల గిరినాగును చాకచక్యంగా పట్టుకొని తన సంచిలో బంధించారు. తరువాత సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని కృష్ణ తెలిపారు. పాము పట్టుబడడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పోషకాహార భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై మండలంలోని మొగలిపురం బండిమాంబ గుడి వద్ద మొగలిపురం-2 అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ వి.లలితకుమారి మాట్లాడుతూ పిల్లల తల్లులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం, మూడేళ్ల లోపు పిల్లలకు ప్రేరణతో అభివృద్ధి చేయడం, పోషణతో కూడిన విద్యపై కల్పించడం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిర, అంగన్వాడీ కార్యకర్త యడ్ల లక్ష్మీ, పుచ్చ పైడితల్లమ్మ, తల్లులు, పిల్లలు, పాల్గొన్నారు.

ఎండలో నిరసన చేపడుతున్న దళిత రైతులు

దౌర్జన్యం

- రిలే దీక్షా శిబిరం టెంట్‌ను తొలగించిన అధికారులు
- మండు టెండ, వర్షంలో కొనసాగిన దళిత రైతుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మాకవరపాలెం మండలం జి.కోడూరు ప్రాంతంలో క్వారీని రద్దు చేయాలంటూ దళిత రైతులు సుమారు 62 రోజులుగా శాంతియుతంగా నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనను ఇంతవరకు ఏ అధికారులు పట్టించుకోకపోగా ఆదివారం దీక్షా శిబిరం టెంట్‌ను దౌర్జన్యంగా తొలగించారు. దీంతో రైతులు, సిపిఎం, ఏఐబీఎస్పీ నాయకులు సోమవారం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దళిత రైతులు రెండు నెలలుగా నిరంతరాయంగా దీక్ష చేస్తున్నప్పటికీ, రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీస్ అధికారులు ఎలాంటి స్పందనా చూపు లేదని దళిత రైతులు దుయ్యబట్టారు. సెలవు దినమైన ఆదివారం రైతులు లేని సమయంలో టెంట్‌ను అక్రమంగా తొలగించారన్నారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇలాకాలో దళిత రైతులు 62 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా ఇంతవరకు పట్టించుకొనే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు..సోమవారం ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ఎండలో, తర్వాత వర్షంలో గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. 'క్వారీ రద్దు చేయాలని, అధికారుల దౌర్జన్యం నశించాలని' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ, 62 రోజులుగా రైతులు శాంతి యుతంగా నిరాహార దీక్ష చేస్తుంటే, ముందస్తు సమాచారం లేకుండా టెంట్‌ను తొలగించడం దుర్మార్గమన్నారు. వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. అధికారులు ఎవరి ప్రోత్సాహంతో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారో అందరికీ తెలుసని, ప్రజా వ్యతిరేక చర్యలకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఏఐబిఎస్పి రాష్ట్ర కార్యదర్శి బహుజన బొట్టా నాగరాజు మాట్లాడుతూ, 62 రోజుల నుండి దీక్ష చేస్తుంటే ఈ అధికారులకి దళితుల ఆవేదన కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి పిరికిపంద చర్య అన్నారు. రైతులు లేనప్పుడు టెంటును తీయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిరంజీవి, రైతు సంఘం నాయకులు అప్పారావు, పెంటయ్య, లావరాజు, గణేష్, కళ్యాణం పాల్గొన్నారు.



ఆర్‌డిఓతో మాట్లాడుతున్న నేతలు

కబ్జాలపై ప్రజా సంఘాల నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో ప్రభుత్వ ఆస్తుల్లో కబ్జాలను నిలిపివేయాలని సోమవారం స్థానిక ఆర్డీవో వివి రమణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను ఆక్రమించి వ్యాపారాలు నడపడం, ప్రజా ప్రాంగణాల సమీపంలో మద్యం దుకాణాలు ప్రారంభించడంతో సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారికంగా అనుమతులు పొందిన వైన్ షాపులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కోట్లది రూపాయలు విలువ చేసే ప్రజల ఆస్తులు బహిరంగంగా కబ్జా చేస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్రాందీ షాపులు ఏర్పాటు చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల సమీపంలో బ్రాందీ షాపులు పెట్టినా అధికారులు కన్నెత్తి చూడడం లేదని, వీధి వీధికి బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. త్రిమూర్తులు, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు, కెవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ఐద్వా నాయకులు ఎల్.గౌరి,కె.వి. సూర్యప్రభ, సత్య పాల్గొన్నారు.

కంపెనీల పేరుతో భూముల కబ్జా

-మాజీ ఎమ్మెల్యే గణేష్,

-త్వరలో పూర్తి వివరాలు వెల్లడి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:మాకవరపాలెంలో 400 ఎకరాలకు సంబంధించి 100 కోట్ల రూపాయలు స్కామ్ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్థానిక వైఎస్సార్ క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాకవరపాలెం మండలానికి చెందిన ఇద్దరు, ముగ్గురు నాయకులతో కలిసి ఓ రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి పాత్రతో ఈ స్కామ్ కు స్కెచ్ వేశారని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన అన్నారు. ఇప్పటికే ఇక్కడ జరుగుతున్న స్కామ్‌పై కూటమి భాగస్వామి బీజేపీ పార్టీ నాయకుడు అనకాపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. కంపెనీల పేరుతో 400 ఎకరాల భూమికి బినామీ రైతులతో ఆక్రమించుతున్నారని, ఏ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారో కూడా చెప్పనప్పటికీ అధికారులు హడావుడితో తెలుగుదేశం పార్టీ నాయకులకు సహకరిస్తూ ఈ భారీ స్కాంకు తోడ్పాటు అందిస్తున్నారని ఆయన అన్నారు.ఇప్పటికే ఈ భూమి సాగులో ఉన్న రైతులు కాకుండా పక్క గ్రామాల రైతులను కూడా తీసుకొచ్చి తెలుగుదేశం పార్టీ నాయకులు వారి బంధువులు అనుచరులు పేర్లతో రెవెన్యూ అధికారులతో లిస్టు తయారు చేశారని, త్వరలోనే ఆ బినామీ రైతులు, ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషిస్తున్నటువంటి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారుల పూర్తి వివరాలు తెలియ పరుస్తామని మాజీ ఎమ్మెల్యే గణేష్ తెలిపారు.

గంజాయి రవాణాపై నిఘా

ప్రజాశక్తి-గొలుగొండ:జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు గొలుగొండ ఎస్ఐ పి.రామారావు ఆధ్వర్యంలో గంజాయి అక్రమ రవాణా నిరోధానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం భీమవరం చెక్ పోస్టును సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానస్పద కదలికలపై నిశితంగా నిఘా పెట్టాలని సూచించారు. అక్రమ రవాణా మార్గాలను గుర్తించేందుకు డ్రోన్ సర్వైలెన్స్‌ను వినియోగించాలని చెప్పారు.

మాట్లాడుతున్న ఎస్ఐ

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై

చెవిలో పువ్వులు పెట్టుకుని మత్స్యకారుల నిరసన

నిరసన చేపడుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి మత్స్యకారుల బతుకులు బుగ్గి పాలు చేయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన్న దొరబాబు అన్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 9వ రోజుకు చేరింది. మత్స్యకారుల రిలే దీక్షకు సిపిఎం, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపి, ఆందోళనలో పాల్గొన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ మత్స్యకారులు, నాయకులు చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నాయకులు మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల జీవితాలతో ఆటలాడు కుంటున్నాయన్నారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని,ఉపాధిని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ఏర్పాటును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మత్స్యకారులను నమ్మించి మోసం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శివ, మత్స్యకార నాయకులు బాబ్జి, మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు, ఎరిపిల్లి నాగేష్, పి.రాంబాబు, డి.నానాజీ, సోమేష్, జి స్వామి, బి బాబ్జీ,మాధవ, కాశి,మాధవ రావు ,కాశీ, శ్రీను, కె దేముడు,బంగారాజు, బైరాగి రాజు,బాపూజీ పాల్గొన్నారు.

నేటి నుండి ఉపమాక వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23న మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఉత్సవ కావిడితో లాంఛనంగా ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు తెలియజేసారు. సోమవారం ఉత్సవాలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 23 వ తేదీ నుండి అక్టోబర్ 2 వరకు 10 రోజులు పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం ఉత్సవ కావిడి తో గ్రామ తిరువీధి సేవ సాయంత్రం 6 గంటలకు ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సుదర్శన

వెంకన్న ఆలయం

పెరుమాళ్ వారిని పల్లకీలో అధిష్టింప చేసి మత్స్యగ్రహణ (పుట్టమన్ను) సేవతో గ్రామ తిరువీధి సేవ,రాత్రి అశ్వ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ రెండో తేదీ వరకు ప్రతిరోజు స్వామివారి ఉత్సవమూర్తులతో తిరు వీధి సేవలు నిర్వహిస్తామన్నారు. 29న సోమవారం వసంతోత్సవం,అక్టోబర్ 1 బుధవారం సాయంత్రం మృగ వేట వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవములు సందర్భంగా పది రోజుల పాటు సాయంత్రం 6 గంటలకు గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద లక్ష్మీ సహస్ర కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా గురజాడ జయంతి

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: స్థానిక నంబర్ వన్ గిరిజన హాస్టల్లో సోమవారం గురజాడ అప్పారావు జయంతి వేడుకను ఐద్వా, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు ఎల్.గౌరీ, కె.వి.సూర్యప్రభ, జన విజ్ఞాన వేదిక నాయకుడు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ, గురజాడ అప్పారావు రచనలు సమాజంలో చైతన్యం, స్ఫూర్తిని నింపాయన్నారు. మహిళలు ఫోన్ ట్రాప్, సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా నేతలు

బుక్‌లెట్‌లను చూపుతున్న విద్యార్థులు

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:వృత్తి విద్య కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వృత్తి విద్య ఉపాధ్యాయులు యం.సాయిచందు, బి.లలిత తెలిపారు. మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విభాగంలో విద్యను అభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్స్, ఐటి/ఐటిఈయస్ పై ఇంటర్న్షిప్ కార్యక్రమం నిర్వహించారు. దొంకాడ, దోసలపాడు గ్రామాల్లో సెల్ పాయింట్, కంప్యూటర్ పాయింట్లను విద్యార్థులతో సందర్శించి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న వెంకటేష్

27న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ఏర్పాటుపై ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న పర్యావరణ ప్రజాభి ప్రాయ సేకరణ ను జయప్రదం చేయాలని పాయ కరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. నక్కపల్లి హోంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద సోమవారం నియోజకవర్గ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రజాభి ప్రాయ సేకరణ పై పార్టీ నేతలు చర్చించారు. రానున్న కాలంలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి కానున్నదని, ఈ ప్రాంత వాసులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతుందని, ఈ ప్రాంత యువతీ, యువకులు మద్దతును తెలియజేయాలన్నారు.

ఉపమాకలో తాగునీటి ఎద్దడి

- నాలుగు రోజుల నుండి కుళాయిల బంద్
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఉపమాక గ్రామం లో ప్రజలు తాగునీటి ఇబ్బందులతో సతమతమ వుతున్నారు. గత నాలుగు రోజుల నుండి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో ప్రజలు దాహం కేకలతో అల్లాడుతున్నారు. నాలుగు రోజుల నుండి తాగునీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని మహిళలు ఆవేదన వెలిబుచ్చారు. కుళాయి నీరు తప్ప, వేరే నీటి సౌకర్యం లేదని అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ, నాలుగు రోజుల నుండి తాగునీటి సరఫరా నిలిచి పోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ కనీసం పట్టించుకోలేదన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌తో మాట్లాడుతున్న స్పీకర్

మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై స్పీకర్ సమీక్ష

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో మార్కెట్ యార్డ్ అభివృద్ధి పై కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ సోమవారం అమరావతిలో అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం మార్కెట్ యార్డ్‌లో 95 లక్షల వ్యయంతో రైతు బజారు ఆధునికీకరణ, కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్సులు, 43 లక్షల రూపాయలతో గోదాములు, షాపుల నిర్మాణం వంటి అంశాలపై వ్యవసాయ శాఖ కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ మంత్రి పోలి నాయుడులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్చించారని మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి రమణ సోమవారం మీడియా కు వెల్లడించారు. అదేవిధంగా గత ప్రభుత్వ కాలంలో నిర్వీర్యం చేసిన నర్సీపట్నం బూసార పరీక్షా కేంద్రాన్ని తిరిగి పున:ప్రారంభించేందుకు కూడా అనుమతులు కోరారని చెప్పారు.

నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

సమస్యలు పరిష్కరించకుండా..

ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ఈనెల 27 వ తేదీన ఆర్సెలార్ మిట్టల్,నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం సమంజసం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు. మండలంలో చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో సోమవారం రాత్రి నిర్వాసితులతో కలిసి నిరసన తెలియజేశారు. కారిడార్ ఏర్పాటు కోసం బుచ్చిరాజుపేట, బుచ్చి రాజు పేట కొత్తూరు, చందనాడలో కర్రి వారి వీధి, తుమ్మల పేట, తమ్మయ్యపేట, పాటి మీద,మూలపర్ర,డి ఎల్ పురం గ్రామాల్లో రైతుల నుండి భూములు ,నివాస గృహాలు అధికారులు సేకరించడం జరిగిందని తెలిపారు. సుమారు 745 కుటుంబాలను వేరే ప్రాంతానికి తరలిస్తున్నారన్నారు. ఈ కుటుంబాలలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ 25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసితులు పోరాడుతున్నా, ప్రభుత్వం అవేమీ పరిగణనలోకి తీసుకోకుండా ప్యాకేజీ కేవలం 8,98,000 రూపాయలు మాత్రమే ప్రకటించారన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎం.రమణ, పద్మ, రాజేష్ ,నరసమ్మ, దేవి, నానాజమ్మ, చక్రమ్మ, ధనలక్ష్మి, బాబూరావు, మంగ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-చింతపల్లి : రాజుపాకల జాతీయ రహదారి నుండి సిరిపురం గ్రామం వరకు రహదారి ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను స్థానికులు శ్రమదానం చేయడంతో తొలగించారు. రహదారి పక్కన పెరిగిన పొదల కారణంగా వాహనదారులకు మార్గం సరిగా కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సర్పంచ్ గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని ప్రాంతాల్లో కూడా ఇలాంటి శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు కొనసాగిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అధిక విద్యుత్ బిల్లులు, గ్యాస్ సరఫరా చేయాలని

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో చీమలపాడు పంచాయతీ సి.కే పాడు, చలిసింగం తదితర గ్రామాల ఆదివాసి గిరిజనుల విద్యుత్ బిల్లులు తక్షణమే రద్దు చేయాలని, నిలిపివేసిన విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు అనంతరం విద్యుత్ శాఖ ఏఈ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. గోవిందరావు మాట్లాడుతూ రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ చలి సింగం కొండ శిఖర గ్రామంలో 20 కుటుంబాల వారికి రూ.5000 నుండి 22000ల వరకు అధిక విద్యుత్ బిల్లులు రావడం జరిగిందన్నారు. గిరిజనులు రెండు బల్బులు, ఒక ఫ్యాను మించి ఏమీ వాడరని ఆయన తెలిపారు. అటువంటిది అధిక మొత్తంలో బిల్లులు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్రావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని గిరిజన గ్రామాలకు తక్షణమే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని రావికమతం తలసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, మండలంలోని కొత్తకోట నుంచి సి కె పాడు వరకు రోడ్డు సౌకర్యం ఉందన్నారు. చలిసింగం గ్రామంలో 70 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారన్నారు. వీరందరూ కొత్తకోట గ్రామానికి వచ్చి గ్యాస్ విడిపించు కోవాలంటే అదనంగా వంద రూపాయలు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సదుపాయం ఉన్నందున గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు గ్యాస్ వ్యాన్ ద్వారా సి.కె పాడు, చలసింగం తదితర గ్రామాలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దారు అంబేద్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.)లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్‌ఓ వై.సత్యనారాయణ రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ అనిత తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. 241 అర్జీలు ప్రజల నుండి వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహించారు. పరిష్కారం కాని అర్జీల గురించి వారికి అందుకుగల కారణాలు వివరంగా, తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని అర్జీదారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జెసి జాహ్నవి, కలెక్టర్ విజయ కృష్ణన్

మండలంలో భారీ వర్షం

పొంగిన అప్పలనాయుడు చెరువు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భారీగా వర్షం కురిసింది. దీంతో మండలంలోని రాజాం గ్రామం మధ్యలో ఉన్న అప్పలనాయుడు చెరువు పొంగి రోడ్డుపైకి నీరు చేరింది. చెరువు నుండి ఒక్కసారిగా వర్షపు నీరు పొంగి ఎన్టీఆర్ జంక్షన్ నుండి దిగువ మూడు రోడ్ల జంక్షన్ వరకు భారీగా రోడ్డుపై నీరు ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైక్‌లపై ప్రయాణం చేసేవారు నీటి ఉధృతికి నీటిలో పడిపోయారు. వాహనదారుల మొబైల్‌లు సైతం కొట్టుకు పోయాయని వాపోయారు.

చెరువు పొంగి మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్షంతో వ్యాపారులకు ఇబ్బందులు

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం సోమవారం వారపు సంతలో వర్షం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సంతకు అనేక గ్రామాల నుండి అమ్మకాలు, కొనుగోలు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో చిరు వ్యాపారం చేసేవారు వర్షంలో అమ్మకాలు సాగించలేకపోయారు. ఉదయం మేకలు, పొట్టేలు, కోళ్ల విక్రయాలు బాగా సాగాయి. గత 4 సోమవారాల నుండి సాయంత్రం వర్షం కురువడంతో నష్టం వాటిల్లుతుందనిపలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

24న పంచాయతీ కార్మికుల సమస్యలపై

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపుమేరకు ఈ నెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.అప్పలరాజు, ఎ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లాలోని 660 పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, అతి తక్కువ వేతనాలతో బతుకుతున్నారని పేర్కొన్నారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఎక్కడా అమలు కావడం లేదని వాపోయారు. టెండర్ పేరుతో మేజర్ పంచాయతీల్లో పిఎఫ్, ఈఎస్ఐలు అమలు చేయడం లేదని, సంవత్సరాల తరబడి కార్మికులు పనిచేస్తున్న ఎటువంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంచాయతీల్లో హెల్త్ అలవెన్స్ రూ.4,000 ఇవ్వాలని, పది లక్షల బీమా సదుపాయం కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.